క్లుప్తంగా

నిర్వహణకు నోచుకోని వాటర్ ట్యాంక్


కుళాయిలు మరమ్మతులకు గురి కావడంతో వృథాగా పోతున్న నీరు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని తులశాపురం గ్రామంలో ప్రజలకు మంచినీరు అందించేందుకు ఏర్పాటు చేసిన వాటరు ట్యాంక్‌లను గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో ట్యాంకు చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచి అపరిశుభ్రంగా మారాయి. తులాశపురం గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయ సమీపాన నీటి ట్యాంక్ చుట్టూ అపరిశుభ్రంగా ఉండటం, ట్యాంక్‌కు అమర్చిన కుళాయిలు మరమ్మతులకు గురికావడంతో నీరు వృథాగా పోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోయారు. గ్రామ పంచాయతీ అధికారులు ఇప్పటికైనా స్పందించి నీటి ట్యాంకులు శుభ్రంగా ఉండేలా చూడలని, మరమ్మతులు చేసి కుళాయిలను ఏర్పాటు చేస్తే నీటి వృథాను అరికట్టవచ్చన్నారు.

విద్యారంగ సమస్యలపై నేడు ధర్నా

కల్లూరు: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై నేడు (శనివారం) జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి తెలిపారు. శుక్రవారం కల్లూరు మండలంలోని పర్ల, ఎ.గోకులపాడు, సల్కాపురం, పెద్దకొట్టాల, మార్కాపురం, పెద్దపాడు పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత నమోదు, సమస్యల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడుస్తున్నా విద్యా, ఉపాధ్యాయ రంగాల్లోని సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తుందన్నారు. ఉపాధ్యాయులకు బోధన తప్ప, బోధనేతర కార్యక్రమాలు ఉండరాదన్నారు. కార్యక్రమంలో కె. హేమంత్‌రెడ్డి, శేఖర్, సురేష్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట జాతీయ రహదారిపై పిన్నాపురం క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. హైవే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బేతంచెర్లకు పట్టణానికి చెందిన సలీమ్‌బాషా తన భార్య మాబీ, కుమార్తె అస్రాతో కలిసి ద్విచక్ర వాహనంపై నంద్యాలకు బయలుదేరాడు. పిన్నాపురం క్రాస్ రోడ్డు వద్ద మరో బైక్ ఎదురురావడంతో దానిని తప్పించబోయి కిందపడ్డారు. ఈ ఘటనలో భార్య, భర్తకు గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం పాణ్యం సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్య కోసం నంద్యాలకు తరలించినట్లు హైవే పోలీసులు తెలిపారు.

దళిత ప్రజాప్రతినిధులకు అవమానం

గడివేముల: పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో దళిత ప్రజాప్రతినిధులైన పెసరవాయి గ్రామ సర్పంచ్ శేఖర్,ఎంపీటీసీ సైమన్‌కు తీవ్ర అవమానం జరిగింది. గ్రామంలో మంజూరైన స్పౌజ్ పింఛన్ల పంపిణీకి రావాలని పంచాయతీ కార్యదర్శి విశ్వనాథరెడ్డి ఫోన్ చేసి ఆహ్వానించారు. దీంతో సర్పంచ్, ఎంపీటీసీ వెళ్లారు. అయితే వారిని కాదని కూటమి నేతలతో పింఛన్ల పంపిణీ చేయించి ప్రజాప్రతినిధులను అవమానించారు. దళిత వర్గానికి చెందినవారమనే తమను పిలిచి అవమానించారని సదరు ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకే అవమానం జరిగితే సామాన్య ప్రజల పట్ల కూటమి నేతలు ఎలా వ్యవహరిస్తారనేది స్పష్టంగా తెలుస్తుందన్నారు. ప్రోటోకాల్ పాటించకపోవడంపై జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు.

జర్నలిస్టులకు కొత్త అక్రిడేషన్లు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా అర్హులైన జర్నలిస్టులకు కొత్త అక్రిడేషన్లు ఇవ్వడం లేదని, మూడు నెలలకోసారి పాత అక్రిడేషన్ల గడువు పొడిగిస్తూ వస్తోందని ఏపీయూడబ్ల్యూ జే జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈఎస్ రాజు, కె.శ్రీనివాసగౌడ్ విమర్శించారు. వారు శుక్రవారం మాట్లాడుతూ.. ఆగస్టు 5న జర్నలిస్టుల డిమాండ్స్ డేగా సందర్భంగా తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టి కి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. జర్నలిస్టులకు అక్రిడేషన్ల తో పాటు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోరంట్ల కొండప్ప, జిల్లా గౌరవాధ్యక్షుడు సుబ్బయ్య, జిల్లా సలహాదారు కృష్ణారెడ్డి, ఐజేయూ జాతీయ నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

నేడు నగరపాలక సర్వసభ్య సమావేశం

కర్నూలు (టౌన్): నగరంలోని సుంకేసుల రోడ్డులో ఉన్న నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో శనివారం నగరపాలక సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని, 19 అంశాలపై పాలకవర్గం చర్చించి నిర్ణయాలు తీసుకుంటుందని వెల్లడించారు.

ఆదమరిస్తే ప్రమాదమే


ఘాట్ రోడ్డులో గుంతలు పడడంతో రాళ్లు వేసిన దృశ్యం


ఘాట్‌లోని మొదటి మలుపు వద్ద రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు

- అధ్వానంగా తమ్మరాజుపల్లె - సిమెంట్ నగర్ రహదారి
- ఘాట్ రోడ్డులో కనిపించని రక్షణగోడలు
- హడలిపోతున్న వాహనదారులు

పాణ్యం: అధికారంలోకి రాగానే రోడ్లను బాగు చేస్తామని గొప్పగా ప్రకటించిన కూటమి పార్టీలు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా అతీగతీ లేదు. ఏ రోడ్డు చూసినా మోకాళ్లలోతు గుంతలు కనిపిస్తున్నాయి. మండల పరిధిలోని తమ్మరాజుపల్లె-సిమెంట్ నగర్ గ్రామాల మధ్య కొండ ఘాట్ రోడ్‌లో ప్రయాణం అంటే వాహనదారులు హడలిపోతున్నారు. ప్రమాదకరంగా ఉన్న మలుపుల వద్ద ఎలాంటి రక్షణ గోడలు, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు భయపడుతున్నారు.


పై నుంచి దిగే క్రమంలో సైడ్‌వాల్ లేని దృశ్యం

దీనికితోడు ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు దర్శనమిస్తున్నాయి. పలువురు ఆ గుంతల్లో పడి గాయాలపాలయ్యారు. సైడ్ దిమ్మెలు లేని కారణంగా ఘాట్ రోడ్‌లో వాహనాలు దిగే క్రమంలో అదుపు కాక కొండపై నుంచి కిందకు పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇటీవలే సిమెంట్ నగర్ నుంచి తమ్మరాజుపల్లె వైపు వస్తున్న ఓ సిమెంట్ ట్యాంకర్ ప్రమాదశాత్తు పై నుంచి కిందకు పడిన విషయం తెలిసిందే. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు గుంతలను పూడ్చివేయడంతో పాటు మలుపుల వద్ద సైడ్ దిమ్మెలు నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.


గడివేముల ఎస్‌ఐ నాగార్జునరెడ్డి నెమలిని ఫారెస్టు బీట్ ఆఫీసర్‌కు అప్పగిస్తున్న దృశ్యం

నెమలి అప్పగింత

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలోని ఎర్రమల కొండల్లోంచి శుక్రవారం ఓ నెమలి గ్రామంలోకి వచ్చింది. దీనిని చూసిన స్థానికులు పట్టుకొని ఎస్‌ఐ నాగార్జునరెడ్డికి అందజేశారు.ఆయన ఎస్‌ఐ ఫారెస్టు బీట్ ఆఫీసర్ కలాంకు అందించడంతో స్థానిక వెటర్నరీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యం బాగా ఉందని నిర్ధారించుకున్న అనంతరం గని రేంజ్ ఫారెస్టులో వదిలిపెట్టారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతికి నివాళి


గోపికృష్ణ మృతదేహానికి నివాళులర్పిస్తున్న కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి,ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్

కోడుమూరు రూరల్: కోడుమూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గోపికృష్ణ అనారోగ్యంతో శుక్రవారం తెలవారుజామున మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి తదితరులు గోపికృష్ణ మృతికి నివాళులర్పించడంతో పాటు, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్రిష్ణాపురం సర్పంచు శ్రీనివాసరెడ్డి, కోడుమూరు ఉప సర్పంచు మాదులు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రమేష్‌నాయుడు, నాయకులు ప్రవీణ్‌కుమార్, రవికుమార్‌రెడ్డి, జగదీష్, ఈరన్న, మాసుమ్ తదితరులు నివాళులర్పించారు.

పేద విద్యార్థుల అభ్యున్నతే ధ్యేయం


విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు: ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థుల అభ్యున్నతే తమ ధ్యేయమని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శుక్రవారం మండలంలోని నన్నూరు ప్రాథమిక(మెయిన్) పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలోని పేద విద్యార్థులను ప్రోత్సహించే దిశగా తమ వంతు సహాయంగా నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓలు ఓంకార్‌యాదవ్, శ్రీధర్‌బాబు, పాఠశాల హెచ్ఎం ఆదినారాయణరెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఇస్మాయిల్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పగల'బడి' నవ్వుతున్న ఆంక్షలు!

కర్నూలు సిటీ: నవ్విపోదురు గాక మాకేంటి సిగ్గు అన్నట్లు పాఠశాలలో ప్రవేశంపై ఆంక్షలు విధిస్తూ పాఠశాల విద్య డైరెక్టర్ విజయ రామరాజు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థుల పేరెంట్స్, ఎస్ఎంసీ సభ్యులు మినహా ఇతరులు పాఠశాలల్లో ప్రవేశం చేయకూడదని ఆంక్షలు విధించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులతోనూ ప్రకటనలు చేయించారు. గతంలో ఎప్పుడు కూడా ఇలాంటి ఆంక్షలు విధించిన ప్రభుత్వాన్ని చూడలేదని ఉపాధ్యాయ వర్గాలు, విద్యార్థి సంఘాలు అభిప్రాయ పడుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సర్కార్ స్కూళ్లను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దింది. కూటమి ప్రభుత్వం ఏడాదిగా ప్రభుత్వ పాఠశాలల్లో 'నాడు- నేడు' పనులను నిలిపివేసింది. ప్రజల నుంచి ప్రభుత్వంపై వ్యతిరేకత రావడంతోనే విద్యాశాఖ చరిత్రలో ఎప్పుడు కూడా లేని విధంగా పాఠశాలలలో ప్రవేశంపై ఆంక్షలు విధించడం చర్చనీయాశంగా మారింది. విద్యార్థులు పడే అసౌకార్యాలను, ఇబ్బందులపై ప్రతిపక్ష, ప్రజా, విద్యార్థి సంఘాలు వెలికి తీస్తుండడంతో ఈ ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది.

విరాళాలు ఇవ్వండి


ప్రజల నుంచి విరాళాలు సేకరిస్తున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ఓర్వకల్లు: అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా క్యూబా సంఘీభావ నిధికి విరాళాలు ఇవ్వండని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ పిలుపు నిచ్చారు. శుక్రవారం మండలంలోని కేతవరం, నన్నూరు గ్రామాల్లో విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఏఐకేఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో వ్య.కా.స జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న, రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, సీఐటీయూ మండల అధ్యక్షుడు షాజాహాన్, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి మహేష్ హాజరై మాట్లాడారు. క్యూబా అమెరిక సామ్రాజ్యవాదానికి తలొగ్గకుండా పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రంగస్వామి, బుగ్గరాముడు, వెంకటస్వామి, సత్యనారాయణ, మాసూంబాషా, సుబ్బరాయుడు, భాస్కర్, నరేష్, అహ్మద్ రసూల్, బాలన్న, వెంకటేశ్వర్లు, బషీర్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

స్పౌజ్ పింఛన్ల పంపిణీ

కోడుమూరు రూరల్: ఎన్‌టీఆర్ భరోసాలో భాగంగా మండలంలో కొత్తగా మంజూరైన స్పౌజ్ పింఛన్లను ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. శుక్రవారం గూడూరు, కోడుమూరు మండలంలోని వర్కూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేశారు. కార్యక్రమంలో గాజులదిన్నె ప్రాజెక్టు చైర్మన్ కేఈ.మల్లికార్జున గౌడ్, కోడుమూరు ఎంపీడీఓ రాముడు, ఆయా మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పడిదెంపాడులో ఉల్లి నాట్లు వేస్తున్న మహిళలు

జోరుగా ఉల్లి నాట్లు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని పడిదెంపాడు గ్రామం కూరగాయలు, ఆకుకూరల సాగుకు పెట్టింది పేరు. గ్రామానికి కర్నూలు నగరంలోని సీ క్యాంప్ రైతుబజారు 10 కిలోమీటర్ల దూరం మాత్రమే కావడంతో ఇక్కడి రైతులు ఎక్కువగా క్యాలీఫ్లవర్, టమాట, బెండ, వివిధ ఆకుకూరలు, ఉల్లి పంటను రైతులు ఎక్కువగా సాగుచేస్తారు. గ్రామానికి కేసీ కెనాల్, తుంగభద్ర నది సమీపాన ఉండటం వల్ల పంటల సాగుకు నీటి ఇబ్బందులు లేవు. ఈ క్రమంలో ప్రస్తుతం ఉల్లి, క్యాలీఫ్లవర్ నాట్లు జోరందుకున్నాయి. ఎకరం పొలంలో ఉల్లి నాట్లు వేసేందుకు 40 మంది కూలీలు అవసరం. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నాట్లు వేస్తే ఒకరికి కూలి రూ.400 ఇస్తారని కూలీలు తెలిపారు. అలాగే ఎకరం పొలంలో క్యాలీఫ్లవర్ నాట్లు వేసేందుకు నలుగురు కూలీలు అవసరం అవుతారని రైతులు తెలిపారు.


కరిమద్దెల గ్రామంలో వరిసాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం


తిరుపాడులో వరినాట్లు వేస్తున్న కూలీలు

ఆదృష్టం 'వరి'ంచేనా..!

గడివేముల: కేసీ కెనాల్, బోర్ల కింద వరిసాగు చేసే పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. కేసీ ఆయకట్టు కింద పెసరవాయి, కరిమద్దెల, చిందుకూరు, బూజునూరు,తిరుపాడు,కొరటమద్ది గ్రామాల్లో వరిసాగు చేసేందుకు కొందరు పొలాలను ట్రాక్టర్లు, ఎద్దుల ద్వారా దమ్ము చేస్తుండగా.. మరికొందరు వరినాట్లు వేస్తున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో మండలంలో ఏడు వేల ఎకరాల్లో వరిసాగు చేసే అవకాశం ఉంది. గత రబీ సీజన్‌లో వరి సాగు చేసిన రైతులకు అంతంత మాత్రమే దిగుబడులు వచ్చాయి. ఈ సీజన్‌నైనా తమకు కలిసి వస్తుందే మోననే ఆశతో పలువురు వరి సాగు చేస్తున్నారు.

స్పౌజ్ పింఛన్ల కోసం పడిగాపులు


గ్రామ సచివాలయం వద్ద పింఛను కోసం పడిగాపులు కాస్తున్న మహిళలు

కర్నూలు(రూరల్): మండలంలోని నందనపల్లె గ్రామానికి కొత్తగా 9 స్పౌజ్ పింఛన్లు మంజూరు కాగా నగదు అందుకునేందుకు లబ్ధిదారులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ముందుగా కర్నూలు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు గ్రామ పంచాయితీ అధికారులు తెలిపారు. మరికొంత సమయానికి గ్రామ సచివాలయంలోనే పింఛన్ల పంపిణీ జరుగుతుందని చెప్పడంతో లబ్ధిదారులు గందరగోళనికి గురయ్యారు. సచివాలయం వద్ద ఉదయం నుంచి పడిగాపులు కాశారు. పాత పింఛనుదారులకు సొమ్ము అందజేసిన తరువాత స్పౌజ్ పింఛనుదారులకు ధ్రువీకరణ పత్రాలను కంప్యూటర్‌లో పొందుపర్చి సొమ్ము అందిస్తామని సచివాలయ సిబ్బంది తెలపడంతో అలాగే కూర్చుండిపోయారు. అద్దె భవనంలో నిర్వహిస్తున్న ఈ సచివాలయం రెండో అంతస్తులో ఉండటంతో వృద్ధులు ఇనుప మెట్లు ఎక్కడానికి అవస్థలు పడ్డారు. కర్నూలు మండలంలో మొత్తం 189 స్పౌజ్ పింఛన్లు మంజూరైనట్లు అధికారులు వెల్లడించారు.

భోగేశ్వరాలయంలో శ్రావణమాస పూజలు


ప్రత్యేకాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న త్రిపురాంబాదేవి

గడివేముల: మండల పరిధిలోని దక్షిణకాశీగా పిలువబడే దుర్గాభోగేశ్వరాలయంలో శుక్రవారం శ్రావణ మాస పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకు లు శ్యాంసుందర్‌శర్మ, గిరినాథశర్మ తెలిపారు. తెల్లవారు జాము నుంచే స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు వందలాది మంది తరలివచ్చారు. స్వామి, అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు, కుంకుమార్చన పూజ లు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించడంతో పాటు స్థానిక కాశీరెడ్డినాయన ఆశ్రమంలో ఉచి తంగా భోజన సౌకర్యం కల్పించారు. అలాగే మండలంలోని బాలాజీ, మూల పెద్దమ్మ ఆలయంతో పాటు వివిధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ముర్రు పాలు బిడ్డకు శ్రేష్ఠమైనవి


తల్లి పాల వారోత్సవాల పోస్టర్లను విడుదల చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి శాంతికళ, వైద్యాధికారులు


ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారులు

కోడుమూరు రూరల్: తల్లి ముర్రుపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమైనవని, అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లులు ముర్రుపాలను తప్పనిసరిగా ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి శాంతికళ సూచించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గూడూరులో తల్లి పాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి శాంతికళ మాట్లాడుతూ పుట్టిన పిల్లలకు 6 నెలల వరకు తప్పనిసరిగా తల్లి పాలు ఇవ్వాలన్నారు. తల్లి పాలు ఇవ్వడం వల్ల పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందని చెప్పారు. అలాగే వ్యాధులు ప్రబలుతున్న వేళ ప్రజలంతా తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ముఖ్యంగా ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా దోమలు పెరగకుండా చూసుకోవాలన్నారు. అనంతరం ఆమె గూడూరు పీహెచ్‌సీలోని మందుల గది, కాన్పుల గదిని తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. డీఐఓ డాక్టర్ నాగప్రసాద్‌బాబు, డీఎంఓ నూకరాజు, వైద్యాధికారులు షఫీయా బేగం, ప్రత్యూష, సిబ్బంది, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

తల్లిపాలతో ఆరోగ్యం పదిలం

కల్లూరు: తల్లిపాలతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు అన్నారు. శుక్రవారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి తల్లి కాన్పు అయిన వెంటనే గంటలోపు బిడ్డకు పాలు తాపించినట్లయితే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి విజయకుమార్, క్షేత్రస్థాయి పర్యవేక్షకులు నాగరాజు, మద్దమ్మ, సామాజిక ఆరోగ్య అధికారి నీరజ, అంగన్‌వాడీ కార్యకర్త, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో గుడ్డు మాయం


శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గుడ్డులేని భోజనం వడ్డిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వారం రోజులుగా విద్యార్థులకు ఉడకబెట్టిన గుడ్డు, చిక్కీలు అందడం లేదు. మెనూ ప్రకారం సోమవారం నుంచి శనివారం వరకు విద్యార్థులకు గుడ్డు , చిక్కీలు అందించాల్సి ఉంది. అయితే, సోమవారం నుంచి గుడ్డు ఇవ్వడం లేదు. కళాశాలలో మొత్తం 290 మంది విద్యార్థుల ఉన్నారు. వీరికి మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని విద్యార్థుల తల్లిందండ్రులు వాపోతున్నారు. ఈవిషయంపై ప్రిన్సిపాల్ రామన్‌ను వివరణ కొరగా సోమవారం నుంచి గుడ్డు రావడం లేదని, చిక్కీలు సరఫరా కాలేదని చెప్పారు. ఎన్నికల ముందు గొప్పలు చెప్పిన కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కూడా సరిగ్గా అందించడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రదీప్ మండిపడ్డారు.

రోజా దర్గా భూమి అన్యాక్రాంతం

కర్నూలు(అర్బన్): కర్నూలులోని సయ్యద్ ఇషాక్‌సనుల్లా ఖాద్రి అలియాస్ సయ్యద్ ఖాద్రి మియా సాహెబ్ (ఆర్‌హెచ్) రోజా దర్గాకు సంబంధించి సర్వే నంబర్ 218లోని 19.65 సెంట్ల భూమి అన్యాక్రాంతమైనట్లు వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ ముక్తార్ బాషా తెలిపారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఆదేశాల మేరకు.. కల్లూరు పరిధిలోని ముజఫర్‌నగర్ ప్రాంతంలో ఉన్న ఈ భూమిని క్షేత్ర స్థాయిలో పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ భూమి వెంచర్ ప్లోటింగ్ అయ్యిందని, ఆక్రమణ, అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు కూడా జరిగినట్లు తమ పరిశీలనలో తెలిసిందన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు చెప్పారు. అలాగే జిల్లా కలెక్టర్ ద్వారా ఆర్‌డీఓ, జిల్లా రిజిస్ట్రార్‌కు నివేదికలు అందించామన్నారు. భూమిని ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పారిశుద్ధ్య కార్మికుల జీతాలు పెంచాలి


రిలే నిరాహార దీక్ష చేస్తున్న పంచాయతీ కార్మికులు

కోడుమూరు రూరల్: గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుల జీతాలు పెంచాలని సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. జీతాలను పెంచాలని డిమాండ్ చేస్తూ కోడుమూరులో మేజర్ గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు శుక్రవారం సీపీఐ, సీపీఎం నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు రాజు, కామూర్తి రాజు మాట్లాడుతూ ఏళ్లతరబడి గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులుగా పనులు చేస్తున్నా జీతాలు పెరగకపోవడంతో కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నారని వాపోయారు. జీతాలు పెంచాలని ఏళ్ల తరబడి కోరుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని, ప్రభుత్వం స్పందించి పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి కార్మికుడికి రూ.18 వేల జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి, సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు శేషయాదవ్, చిన్న రాముడు, గఫూర్ మియ్యా, వీరన్న, పంచాయతీ కార్మికులు పెద్ద మద్దిలేటి, మదుబాబు, వెంకటేష్, పెద్ద శివ, చిన్న మద్దిలేటి, మహేష్, చిన్న లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకుల ఎస్టీ హోదా పునరుద్ధరణే లక్ష్యం


సి.బెళగల్‌లో నినాదాలు చేస్తున్న వాల్మీకి నాయకులు

సి.బెళగల్: రాష్ట్రంలో వాల్మీకి, బోయలకు ఎస్టీ హోదా పురుద్ధరణే లక్ష్యంగా పోరాటాలు చేయాలని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి (వీఆర్‌పీఎస్) నాయకుడు, ఆలూరు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామ్‌భీంనాయుడు పిలుపునిచ్చారు. సి.బెళగల్‌లోని వాల్మీకి రామాలయంలో శుక్రవారం మండల వాల్మీకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లో వాల్మీకి, బోయ కులస్తుల స్థితిగతులను తెలుసుకున్నారు. వాల్మీకులకు ఎస్టీ హోదా, హక్కుల సాధన కోసం ఆదోనిలో ఈ నెల 9, 10 తేదీల్లో మండల వాల్మీకి ముఖ్య నాయకులతో సమావేశం, అనంతరం నెలాఖరులోగా ఆదోనిలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారని, మండల వాల్మీకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. వాల్మీకి నాయకుడు రోహిత్, రంగన్న, పాండు, మద్దిలేటి, లక్ష్మన్న, గొర్లమద్దిలేటి, రాఘవేంద్ర, సూర్యచంద్ర, వెంకటరాముడు, రాముడు, నాగరాజు, లింగన్న తదితరులు పాల్గొన్నారు.